ఆర్‌ఎస్‌కేల్లో సేవలకు మంగళం

- మూలకుచేరిన కియోస్క్‌లు
- గత ప్రభుత్వంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేత
- ప్రస్తుతం నిలిచిపోయిన సేవలు

ఆమదాలవలస: సాధారణంగా ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు కొలువుదీరినప్పుడు సరికొత్త సేవలను అమల్లోకి తీసురావడం చూస్తుంటాం. కూటమి ప్రభుత్వం మాత్రం కొత్త సేవలు అందించకపోగా.. ఉన్న సేవలకు మంగళం పాడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి నుంచి పంటల సాగు, ఎరువుల సరఫరా, మార్కెటింగ్ వరకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ఉత్పాదకతను పెంపొందిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి సచివాలయం పరిధిలోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్)లను ఏర్పాటు చేసి రైతులకు ఇళ్ల వద్దకే పలు సేవలు అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత వరకు రైతులకు చక్కని సేవలందించిన కియోస్క్‌లు ప్రస్తుతం వినియోగించకపోవడంతో దాదాపు మూలకు చేరిపోయాయి. గత ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ఆచరణలో పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గంలో మండలాల వారీగా రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే), కియోస్క్ యంత్రాల వివరాలు

మండలం	రైతు సేవా కేంద్రాలు	కియోస్క్‌లు
ఆమదాలవలస	23	23
సరుబుజ్జిలి	13	13
బూర్జ	16	16
పొందూరు	25	25


గాజులకొల్లివలస ఆర్‌ఆర్‌కాలనీలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

ఆన్‌లైన్‌లో ఆర్డర్..

గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా రైతులు తమకు కావాల్సినవి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునేవారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరల వివరాలను, పంటల సాగు యాజమాన్య పద్ధతులకు సంబంధించిన సంక్షిప్త వీడియోలు, వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలనే వివరాలను వీటి ద్వారా తెలుసుకునేవారు. కియోస్క్‌లో రైతుల తమ ఆధార్, ఫోన్ నంబర్‌ను నమోదు చేసిన తర్వాత డిజిటల్ సేవలు ప్రారంభమయ్యేవి. రిజిస్టర్ అయిన తర్వాత మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. అక్కడే ఫోన్ పే, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ పూర్తిచేసేవారు. ఈ ప్రక్రియ ముగిసిన 48 నుంచి 72 గంటల్లోగా వారు ఆర్డర్ చేసుకున్నవి ఆర్బీకేలకు చేరేవి. ఇప్పుడు ఈ సేవలేవీ అందడంలేదు.

యంత్రాలను వినియోగించడంలేదు



మా గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఉన్న కియోస్క్ యంత్రం వినియోగించడంలేదు. గత ప్రభుత్వంలో రైతులకు పథకాలు, ఎరువులు, పురుగు మందులు ఇచ్చారు. గతంలోలా అన్ని విధాలా రైతులను ఆదుకుంటే బాగుంటుంది.

– కూన ధర్మరాజు, రైతు, రావికంటిపేట, ఆమదాలవలస

వాడాలని సూచిస్తున్నాం



సిబ్బందికి కియోస్క్ యంత్రాలు వాడాలని చెబుతున్నాం. కియోస్క్‌లకు సంబంధించిన యాప్‌లు వినియోగిస్తూ రైతులకు సేవలు అందిస్తున్నాం. ఎక్కడైనా సేవలు అందకపోతే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ఎం.మోహన్‌రావు, ఏఓ, ఆమదాలవలస

క్లుప్తంగా

న్యాయం చేయాలి


మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు


సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామానికి చెందిన 10 ఏళ్ల బాలికపై సోమవారం లైంగిక దాడి జరిగిందని, బాలికకు న్యాయం చేయాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుప్పిలి వెంకటరావు కోరారు. గురువారం జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు సారవకోట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కేసును విచారణ చేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు, ఎస్‌ఐ అనీల్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని త్వరగా అరెస్టు చేయాలన్నారు. సంఘం నాయకులు నౌగాపు నాగరాజు, భాస్కరరావు, జమ్ము గంగులు, యలమంచి రామారావు, వెంకటరావు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేస్తున్న భక్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప గురుస్వాముల సమక్షంలో కుంబాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సహస్ర ఫలార్చన


సహస్ర ఫలాలతో పూజలు అందుకున్న శక్తి ఆంజనేయ స్వామి

నరసన్నపేట: పట్టణం పెద్దపేట వీధిలోని శక్తి ఆంజనేయ స్వామికి సహస్ర ఫలార్చనలు గురువారం నిర్వహించారు. పలు రకాల ఫలాలతో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వనమాలి శివశంకర వరప్రసాద్ శర్మ భక్తులతో పూజలు చేయించారు. ఆంజనేయ స్వామిని ఫలాలతో అలంకరించారు.

తరల్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్

హిరమండలం: తరల్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని జిల్లా కో ఆర్డినేటర్ జి.గొల్ల సూచించారు. గురవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో టీచింగ్ అండ్ రైట్ లెవల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. 3, 4, 5 తరగతులకు సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎంఈఓ రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో గల స్కూల్ కాంప్లెక్స్‌ల్లో మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశాల నిర్వహణ బాధ్యత ఆయా కాంప్లెక్స్ చైర్మన్‌లదేనని అన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి


కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో విజయగౌరి

కొత్తూరు: విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి (పీడీఎఫ్) కె.విజయగౌరి అన్నారు. మండలంలోని మెట్టూరు, నివగాం, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేజీబీవీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయడంతోపాటు ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వంతో పోరాడుతానన్నారు. ప్రభుత్వ విధానాల వలన మూతపడుతున్న పాఠశాలలను పరిరక్షించడంతోపాటు పలు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దండు ప్రకాశరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు జ్యోతి, స్వర్ణలత, రామచంద్రమూర్తి, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపం!


తెల్లగా కనిపిస్తున్న ప్రహరీ పునాదులు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోందని, వాటరింగ్ అసలు చేయడం లేదని, సిమెంట్ తక్కువగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. బుధవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలించారు. ఇదే విషయంపై సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. గురువారం నాటికి ఎటువంటి మార్పు కనిపించలేదు. ప్రహరీ నిర్మాణ పనుల్లో వాటరింగ్ పూర్తిగా చేయలేదు. గోడ నిర్మించినా ఎన్నాళ్లు ఉండదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

సంక్షిప్తంగా

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్

నరసన్నపేట: స్త్రీ, పురుషుల సమానత్వానికి స్వాతంత్ర్య సమరయోధురాలు, రాజనీతి వేత్త, ప్రముఖ రచయిత సరోజినీ నాయుడు ఎంతగానో కృషి చేశారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. సరోజినీ నాయుడుకు చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలను నిర్మూలించడానికి సరోజినీ నాయుడు ఎంతగానో కృషి చేశారన్నారు. ఆంగ్లంలోని ఆమె రచనలను ఆంగ్ల అధ్యాపకుడు కె.నాగరాజు వివరించారు. తెలుగు అధ్యాపకులు జి.రవికుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి

ఆమదాలవలస: దివ్యాంగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీనియర్ న్యాయవాది తమ్మినేని అన్నంనాయుడు అన్నారు. రాష్ట్రీయ కిశోర స్వచ్ఛత కార్యక్రమం (ఆర్.కె.ఎస్.కె) కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఐ.జె. నాయుడు కాలనీలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 50 ఇళ్లలో సర్వే చేసి నలుగురు దివ్యాంగులను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో కూన శ్రీరామ్ అనే దివ్యాంగుడు 70 శాతం వికలాంగత్వంతో సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ అందడం లేదని గుర్తించారు. ఈయనకు పింఛన్‌ను అందించేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. వైద్య, ఆమదాలవలస కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన..

నరసన్నపేట: కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ సిబ్బందికి చూపించాలని బ్రైట్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ వంక వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉర్లాం, లుకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. చర్మంపై తెల్లటి మచ్చలు ఉన్నా.. మచ్చలు స్పర్శ లేకుండా ఉన్నా వెంటనే పీహెచ్‌సీ సిబ్బందికి చూపించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పొందూరు రూరల్: మండలంలోని ఉపాధి హామీ పథకాన్ని ఉపాధి వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీనివాసరావు సూచించారు. గురువారం మలకాం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

నేటి నుంచి రామయ్య సంబరాలు

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కులపేట గ్రామంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రామయ్య సంబరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొనాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

హిరమండలం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హిరమండలం విద్యార్థి సైలాడ రోహిత్‌కుమార్ ఉత్తమ ఫలితాలు సాధించాడు. ఇటీవల ఫలితాలు విడుదలయ్యాయి. స్థానిక మెండ వీధికి చెందిన రోహిత్ 97.82 శాతం పర్సంటైల్ సాధించాడు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

సారవకోట: మండలంలోని కూర్మనాథపురంలో భూ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన భూముల రీ సర్వేలో తప్పులు వచ్చాయన్నారు. దీని వలన తాము పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని, మరలా భూముల రీ సర్వే చేయాలని కోరారు. రీ సర్వే చేయించడం తమ చేతిలో లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రెవెన్యూ సిబ్బంది అన్నారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం


యలమంచిలిలో కోళ్లఫారం రైతులతో పశువైద్యాధికారి సంతోష్‌కుమార్

జలుమూరు: బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని అచ్చుతాపురం పశువైద్యాధికారి పట్ట సంతోష్ కుమార్ అన్నారు. గురువారం అక్కురాడ, యలమంచిలిలోని కోళ్ల ఫారాల రైతులతో మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు వివరించారు. ప్రధానంగా ముక్కునుంచి నీరు కారడం, తల వాచిపోవడం జరుగుతుందన్నారు. రైతులు వీటిని గమనించి మృతి చెందిన కోళ్లను బయట వేయకుండా పాతిపెట్టాలన్నారు. మనుషులకు సోకే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక సాయి స్వర్ణ ప్యాలస్‌లో గత నెలలో తీసిన లక్కీ డ్రా విజేతలకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం బహుమతులు అందించారు. జనవరి 26న లక్కీ డ్రా తీసి ఐదుగురు విజేతలను ఎంపిక చేశారు. సత్యవరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు ప్రథమ బహుమతిగా పల్సర్ బైక్, విశాఖకు చెందిన పద్మజకు ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రికల్ బైక్, ఎస్.ఈశ్వరసాయికి తృతీయ బహుమతిగా వాషింగ్ మిషన్, శోభనకు నాల్గో బహుమతిగా రిఫ్రిజిరేటర్, ఎస్.మల్లేశ్వరరావుకు ఐదో బహుమతిగా వాటర్ ఫిల్టర్ అందించారు. ఈ సందర్భంగా టెక్కలికి చెందిన ఈశ్వరరావు మట్లాడుతూ సాయి స్వర్ణ ప్యాలస్‌లో నాణ్యమైన బంగారు ఆభరణాలు లభిస్తున్నాయన్నారు. సాయి స్వర్ణ ప్యాలస్ యాజమన్య ప్రతినిధులు నానాజీ, శంకర్, చంద్రకాంత్, రోహిత్, రాజేంద్ర, సునంద, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఈ మేరకు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బుడితి, అవలింగి, చీడిపూడి, తొగిరి, కిన్నెరవాడ, బద్రి, గుమ్మపాడు తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

వర్క్‌షాపులను వినియోగించుకోవాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

ఆమదాలవలస: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్కూల్ కాంప్లెక్స్ వర్క్ షాపులు ప్రశ్నపత్రాల తయారీ కేంద్రాలు కావాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ వర్క్ షాపులపై చర్చా గోష్టి చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాంప్లెక్స్ సమావేశాల కారణంగా రెండు పని దినాల్లో ఉపాధ్యాయులు తరగతులకు దూరమయ్యేవారన్నారు. నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఒక్కపూట వర్క్‌షాప్ వలన ఉదయం పాఠశాలకు వెళ్లడం, మళ్లీ పాఠశాల నుంచి స్కూల్ కాంప్లెక్స్‌కు ఆదరాబాదరాగా రావడం చేయాలన్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఉన్నటువంటి ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని 11:30 గంటల లోపే ముగించడం కొంత కష్టం అయినప్పటికీ ఈ విధానం ద్వారా కొంతమేరకు సానుకూల ఫలితాలు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ప్రారంభానికి ముందుగానే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్ విడుదల చేసి విద్యార్థులకు పూర్తిగా ఉపయోగపడేలా ఫార్మేటివ్, సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల ప్రశ్నపత్రాలు తయారు చేయాలని కోరారు. బోధనోపకరణాల తయారీ, నో బ్యాగ్ డే కార్యక్రమాలకు ఊతమిచ్చే సృజనాత్మక కృత్యాలు తయారీకి అనువుగా కాంప్లెక్స్ సమావేశాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హెచ్.సత్యం, బి.శ్రీను, ఎ.గోపి, ఎం.రమేష్, హెచ్.రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.